సంపుటి : 9
సంచిక : 294
శుక్రవారం
17 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.


SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



విశ్వంవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!

Contact For Ads:
7579339999

ఏపీలో మళ్లీ

## కరోనా కలకలం

జూన్ 26 నుంచి జులై 16 వరకు 12 పాజిటివ్ కేసులు, నలుగురి మృతి

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మిగతా .. 2లో..



అంత్యక్రియల్లో

## ఆంబోతులా రంకెలేశారు

అంబటిపై ఎమ్మెల్యే గోరంట్ల ఫైర్

**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ చోటుచేసుకున్న పరిణామాలు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రవర్తనపై మిగతా .. 2లో..



100 కేసులు పెట్టినా

## భయపడను

ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా: అంబటి రాంబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ పోలీసుల విధులకు మిగతా .. 2లో..




రాజధాని అమరావతిలో

# తొలిసారి జగన్నాథ రథయాత్ర

- బంగారు చీపురుతో ఊడ్చి రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు
- అమరావతి, పోలవరం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువు తరహాలో రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి చంద్రబాబు తన సేవను చాటుకున్నారు. అనంతరం జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగి యాత్రను మిగతా .. 2లో..



హైదరాబాద్‌లో

# పవన్ కలిసిన గవర్నర్

పవన్ ఇంటిలోని గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలపై చర్చ
త్వరగా కోలుకుని విధులోకి రావాలని ఆకాంక్ష

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గవర్నర్ ఆయన నివాసానికి చేరుకుని, ఆయన్ను ఆత్మీయంగా పలకరించారు. శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలను, సలహాలను తప్పనిసరిగా పాటించాలని పవన్‌కు సూచించారు. ఆయన త్వరగా మిగతా .. 2లో..

గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్

## క్షమాపణ చెప్తోంది

మంత్రి నారా లోకేష్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరరాజా గ్రూప్ సీఎండీ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్ క్షమాపణ చెప్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరరాజా సంస్థను గత ప్రభుత్వం వేధింపులకు గురి చేయకుండా ఉండాల్సిందన్నారు. ఈ మేరకు మిగతా .. 2లో..

టీఎంసీకి

## మరో ఎదురుదెబ్బ

ఎంపీ పదవికి కోయల్ మల్లిక్ రాజీనామా




**విశ్వం వాయిస్ న్యూస్ :** తృణమూల్ కాంగ్రెస్ నుంచి రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయి. తాజాగా పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ కోయల్ మల్లిక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. నాలుగు నెలల కిందటే టీఎంసీ తరఫున ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇంత తక్కువ సమయంలోనే మిగతా .. 2లో..

పూరీ జగన్నాథ రథయాత్రలో

## తొక్కిసలాట

ఇద్దరు మృతి, 100 మందికి పైగా గాయాలు



**గోపాల్‌పూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా భక్తులు తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. 100 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో మిగతా .. 2లో..

## 22న ‘తల్లికి వందనం’ నిధులు విడుదల

పాఠశాల నిర్వహణ కోసం రూ.2,000 మినహాయింపు, తల్లి ఖాతాలో రూ.13,000 జమ
2026-27 విద్యా సంవత్సరానికి పథకం అమలుకు ఉత్తర్వులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘తల్లికి వందనం’ పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఈ పథకం అమలు, మార్గదర్శకాల కోసం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం జీవో నెం.15, జీవో నెం.16 జారీ చేశారు. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 42,70,802 మంది తల్లులకు, వారి 67,47,190 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. జులై 22వ తేదీన లబ్ధిదారుల మిగతా .. 2లో..

రాష్ట్రాన్ని దోచేస్తున్నారు..

## అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు : జగన్



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన మిగతా .. 2లో..




ముద్రగడ అంత్యక్రియల్లో

## వైకాపా తీరు హేయం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో వైకాపా నాయకులు అనుసరించిన తీరు అత్యంత హేయమని, ప్రభుత్వ లాంఛనాలను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం ఆయన మిగతా .. 2లో..

## న్యూజిలాండ్‌లో భూకంపం..



సునామీ హెచ్చరికలు జారీ

**విశ్వం వాయిస్ న్యూస్ :** న్యూజిలాండ్‌లోని దక్షిణ ద్వీపంలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.3గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు మిగతా .. 2లో..



బాబు రాష్ట్రానికి క్యాన్సర్ గడ్డ..

## జగన్ రాయలసీమ రత్నం

రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

**విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దగా చేస్తోందని... చంద్రబాబు, లోకేశ్ వైసీపీ అధినేత జగన్‌ను విమర్శించడమే ఏకైక పనిగా పెట్టుకున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. లోకేష్ మిగతా .. 2లో..


‘అమెరికా స్థావరాలను ఆక్రమించి..

## ఆ సైనికుల్ని బంధించండి’

ఇరాన్ నేత వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా- ఇరాన్ తమ మధ్య కుదుర్చుకున్న ఒప్పందాన్ని సైతం పక్కన పెట్టేసి మరీ మరోసారి భీకర దాడులు చేసుకుంటున్నాయి. దీనికితోడు ఇరు దేశాల నేతలు చేస్తున్న వ్యాఖ్యలతో ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ క్రమంలో 100 మంది అమెరికా సైనికులను మిగతా .. 2లో..



మిగతా .. 2లో..
మిగతా .. 2లో..

తుని వద్ద

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

గరీబ్ రథ్ సహా పలు ప్యాసింజర్ రైళ్లు ఆలస్యం
ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన రైల్వే సిబ్బంది



**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తునిలో గురువారం సాయంత్రం ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదం కారణంగా అత్యంత రద్దీగా ఉండే విశాఖపట్నం - విజయవాడ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం మిగతా .. 2లో..

## ఉరేసుకున్న ప్రేమికురాలు

మృతదేహానికి ప్రేమికుడు తాళి కట్టాలని కుటుంబసభ్యుల ఆందోళన



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమ విఫలమైందన్న మనస్తాపంతో గుంటూరు జిల్లాకు చెందిన ఓ యువతి ముంబైలో ఆత్మహత్య చేసుకుంది. ప్రియుడు పెళ్లికి నిరాకరించడమే ఆమె మృతికి కారణమని ఆరోపిస్తూ, బాధిత కుటుంబ సభ్యులు యువకుడి ఇంటి ముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ ఘటన ప్రకాశం జిల్లాలో తీవ్ర మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# తొలిసారి జగన్నాథ రథయాత్ర

ప్రారంభించారు. ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శుభసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# ఏపీలో మళ్లీ కరోనా కలకలం

కొత్తగా కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

## అంత్యక్రియల్లో ఆంబోతులా రంకెలేశారు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను గౌరవప్రదంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుంటే, అంబటి రాంబాబు పెద్దపెద్దగా అరుస్తూ ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడాన్ని బుచ్చయ్య చౌదరి తీవ్రంగా తప్పుబట్టారు. "ఒక మహోన్నత నేత అంత్యక్రియలు జరుగుతుంటే... అక్కడ అంబటి రాంబాబు ఒక ఆంబోతులాగా రంకెలేస్తూ ప్రవర్తించడం అత్యంత దారుణం. బతికున్నప్పుడు ముద్రగడను అవమానించారు... ఇప్పుడు చావు దగ్గర కూడా నీచమైన రాజకీయం చేయడం వైసీపీ నేతలకే చెల్లింది" అని ధ్వజమెత్తారు. కన్న తండ్రి చివరి చూపు కోసం వచ్చిన ముద్రగడ కుమార్తెను భౌతికకాయం వద్దకు రానివ్వకుండా అడ్డుకోవడాన్ని బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కుటుంబంలో ఇలాంటి గొడవలు పెట్టడం, కన్నబిడ్డను దూరం చేయడం ఏ రకమైన సంస్కృతి అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ అధినేత జగన్ ఎక్కడికి వెళ్లినా అక్కడ అల్లర్లు సృష్టించడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. కేవలం రాజకీయ మైలేజ్, హైప్ క్రియేట్ చేసుకోవడం కోసమే ఇలాంటి శవ రాజకీయాలు, డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అంత్యక్రియలకు వెళుతూ కూడా భారీ ర్యాలీలు చేయడం ఏంటని నిలదీశారు.

## 100 కేసులు పెట్టినా భయపడను

ఆటంకం కలిగించారనే ఆరోపణలపై తనపై కేసు నమోదు కావడం పట్ల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను అంబటి రాంబాబు పూర్తిగా సమర్థించుకున్నారు. చనిపోయిన తర్వాత కూడా ముద్రగడ భౌతికకాయం వద్ద రాజకీయం చేయాలని చూశారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముద్రగడ పద్మనాభం బతికున్నప్పుడు ఆయన్ను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని, చనిపోయాక ఇప్పుడు అధికారిక లాంఛనాలు ఇస్తామనడం రాజకీయ కుట్రని అంబటి ఆరోపించారు. "ప్రభుత్వ లాంఛనాలు మాకొద్దు అని ఆయన కుటుంబం ముందే స్పష్టం చేసింది. వాళ్లు వద్దంటున్నా పోలీసులు ఎందుకు వచ్చారు? ముద్రగడ ఆత్మ శాంతించడం కోసమే మేము పోలీసులను అడ్డుకున్నాం. ఇందులో ఎలాంటి తప్పు లేదు" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాష్ట్ర డీజీపీ తనపై ప్రత్యేక నిఘా పెట్టారని అంబటి ఆరోపించారు. రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అమరావతి వెళ్లినప్పుడు, అలాగే రాజమండ్రి జైలు నుంచి బయటకు వస్తున్నప్పుడు కూడా తనపై అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. తనపై వంద కేసులు పెట్టుకున్నా భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. "తాను కాపుల ప్రతినిధిని కానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పుకున్నప్పుడు, ఆయన ఇంకా కూటమిలో ఎందుకు కొనసాగుతున్నారు?" అని అంబటి ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కాపు సామాజికవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

# పవన్ కలిసిన గవర్నర్

పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, ప్రజాసేవలో తన విధులను తిరిగి ప్రారంభించాలని గవర్నర్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ జస్టిస్ నజీర్, పవన్ కల్యాణ్ నివాసంలో ఉన్న గ్రంథాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించడం విశేషం. ఆ లైబ్రరీలో ఉన్న పలు పుస్తకాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయితలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రాసిన అనేక గ్రంథాలను చూసి, వాటిపై పవన్ కల్యాణ్‌తో ఉత్సాహంగా చర్చించారు. ఇద్దరి మధ్య పుస్తకాలపై ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన అభ్యర్థన మేరకు, జస్టిస్ అబ్దుల్ నజీర్ ఓ పుస్తకంపై తన సంతకం చేశారు. తన ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకు స్వయంగా సమయం తీసుకుని ఇంటికి వచ్చిన గవర్నర్‌కు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన పూర్తిగా మర్యాదపూర్వకంగా, ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్ క్షమాపణ చెప్తోంది

'ఎక్స్'లో లోకేశ్ పోస్ట్ చేశారు. "గడిచిన నాలుగు దశాబ్దాలుగా అమరరాజా కేవలం ఆంధ్రప్రదేశ్ సాధించిన అతిపెద్ద పారిశ్రామిక విజయాల్లో ఒకటిగానే కాకుండా అంతకుమించి నిలిచింది. ఈ సంస్థ ప్రపంచస్థాయి ఉత్పాదకతను సృష్టించి వేలాది మందికి ఉద్యోగాలు అందించింది. చిత్తూరుతో పాటు ఆంధ్రప్రదేశ్ పేరును భారతదేశమంతటా, ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పింది. గత ప్రభుత్వం ఈ సంస్థను వేధింపులకు గురి చేయకుండా ఉండాల్సింది. సొంత రాష్ట్రంలోనే పరిశ్రమను స్థాపించి, వృద్ధి చేయాలని భావించిన ఒక పారిశ్రామికవేత్తకు ఉండాల్సింది ప్రోత్సాహం కానీ.. బెదిరింపులు కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన సంస్థ తన తదుపరి వృద్ధి ప్రయాణం కోసం రాష్ట్ర సరిహద్దులు దాటి వేరే చోటికి వెళ్లాల్సి రావడం ఎంతగానో కలచివేసింది. తిరిగి నమ్మకాన్ని పునర్నిర్మిస్తున్న తరుణంలో ఏపీ పారిశ్రామిక రంగం అమరరాజాకు మళ్లీ స్వాగతం పలుకుతోంది. ఆ సంస్థ తన ప్రయాణాన్ని ప్రారంభించిన రాష్ట్రంలోనే.. భవిష్యత్తులోనూ అతిపెద్ద సువర్ణాధ్యాయాలు లిఖించబడతాయి. అమరరాజా కోసం ఏపీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి" అని లోకేశ్ పేర్కొన్నారు.

## టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

ఆమె రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే.. రాజీనామాకు గల కారణాలు కోయల్ ఇంకా వెల్లడించలేదు. ఇటీవల టీఎంసీలో కొనసాగుతున్న అసంతృప్తి, వలసల నేపథ్యంలో ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బుధవారం టీఎంసీ సీనియర్ ఎమ్మెల్యే, మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్థుడైన మదన్ మిశ్ర ఆమె వర్గాన్ని వీడి రితబ్రతా బెనర్జీ తిరుగుబాటు వర్గంలో చేరిన సంగతి తెలిసిందే. కోయల్ రాజీనామాతో రాజ్యసభలో టీఎంసీ బలం 9కి పడిపోయింది.

## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

ఒకరిని కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. మరోకరి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు, అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల

ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్లను తగ్గించి, వారి చదువులో తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. గత విద్యా సంవత్సరం (2025–26) నుంచి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒక్కో బిడ్డకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్–ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

### నిధుల కేటాయింపు, చెల్లింపు విధానం

ప్రతి విద్యార్థికి అందించే రూ.15,000 ఆర్థిక సహాయం నుంచి రూ.2,000 పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణ, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మినహాయిస్తారు. మిగిలిన రూ.13,000 నేరుగా అర్హులైన తల్లుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, తల్లులను ఆర్థికంగా ప్రోత్సహించడం కూడా ప్రభుత్వ ఉద్దేశం.

**పథకానికి అర్హతలు ఇవే:** 'తల్లికి వందనం' పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన అర్హత నిబంధనలను నిర్దేశించింది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖ ఆరు దశల ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

**ఆదాయం:** గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,000, పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 మించకూడదు.

**భూమి:** మాగాణి అయితే 3 ఎకరాల లోపు, మెట్టభూమి అయితే 10 ఎకరాల లోపు ఉండాలి. రెండూ కలిపి ఉన్నా 10 ఎకరాల పరిమితికి లోబడే ఉండాలి.

**వాహనం:** కుటుంబంలో ఎవరి పేరు మీదా నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. అయితే, టాక్సీ, ట్రాక్టర్, ఆటోలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.

**విద్యుత్ వినియోగం:** కుటుంబం నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లకు మించరాదు. దీని కోసం గత 12 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటారు.

**ఆస్తి:** పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబానికి 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో మున్సిపల్ ఆస్తి ఉండకూడదు.

**ప్రభుత్వ ఉద్యోగం:** కుటుంబ సభ్యుల్లో ఎవరూ కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగిగా ఉండరాదు. ప్రభుత్వ పింఛనుదారులకు కూడా ఇది వర్తించదు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిర్దేశిత ఆదాయ పరిమితి లోపు జీతం తీసుకునే వారికి మినహాయింపు ఉంటుంది.

**ఆదాయ పన్ను:** కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు కూడా ఆదాయపు పన్ను చెల్లింపుదారుగా ఉండకూడదు.

**చదువు:** విద్యార్థులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల/జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే కోర్సులకు ఈ పథకం వర్తించదు.

### ప్రత్యేక నిబంధనలు, చెల్లింపులు

**అనాథలు:** స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలల్లో చేరిన అనాథలు, వీధి బాలలు ఈ పథకానికి అర్హులే. సంబంధిత జిల్లా కలెక్టర్ వారి తరఫున గార్డియన్–ఆపరేటెడ్ బ్యాంకు ఖాతాను తెరిచి, నిధులు సక్రమంగా అందేలా పర్యవేక్షిస్తారు.

**ఆర్‌టీఇ విద్యార్థులు:** విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల విషయంలో, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును నేరుగా పాఠశాల యాజమాన్యానికి చెల్లిస్తారు. ఆ మొత్తం పోగా ఏమైనా మిగిలితే, దానిని తల్లి ఖాతాలో జమ చేస్తారు.

**ఇతర స్కాలర్‌షిప్‌లు:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందుతున్నట్లయితే, ఆ పథకం కింద వచ్చే మొత్తాన్ని మినహాయించి, మిగిలిన బ్యాలెన్స్ మొత్తాన్ని 'తల్లికి వందనం' కింద చెల్లిస్తారు.

### అమలు షెడ్యూల్, ఫిర్యాదుల పరిష్కారం

పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా విద్యార్థులు, వారి తల్లుల వివరాలను సేకరించి, ఎస్‌జిఎస్‌డబ్ల్యు విభాగం ధ్రువీకరిస్తుంది. జులై 22న అర్హులు, అనర్హుల జాబితాలను సామాజిక తనిఖీ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తర్వాత లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులను జమ చేయాలని ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. తప్పుడు సమాచారం ఇచ్చి లబ్ధి పొందినట్లు తేలితే, ఆ మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. పథకంపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే, ఎస్‌జిఎస్‌డబ్ల్యు కార్యాలయాల్లోని ఆన్‌లైన్ గ్రీవెన్స్ మెకానిజం ద్వారా పరిష్కరిస్తారు.

# అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు : జగన్

తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్పీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?" అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

# న్యూజిలాండ్‌లో భూకంపం..

తక్షణమే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని హెచ్చరించారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన టె అనావ్ పట్టణానికి 40 కిలోమీటర్ల దూరంలో 50 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు న్యూజిలాండ్ నేషనల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ వెల్లడించింది. భూకంపం కారణంగా కొన్ని సెకన్ల పాటు భవనాలు ఊగిపోయాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

## జగన్ రాయలసీమ రత్నం

కడప జిల్లా పర్యటన వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, కేవలం జగన్‌పై నిందలు వేయడానికే ఆయన వచ్చారని విమర్శించారు. వివేకా హత్య కేసులో జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని సీబీఐ, సుప్రీం కోర్టు స్పష్టం చేసినా... కూటమి నేతలు ఇంకా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డ అని.. జగన్ రాయలసీమ రత్నం అని వ్యాఖ్యానించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు రైతు ద్రోహి అని రాచమల్లు విమర్శించారు. ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీలతో రైతులకు తోడ్పాటు అందించిన జగన్ వ్యవసాయాన్ని పండుగ చేసిన నాయకుడని కొనియాడారు. అమరావతిలో రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. జగన్ హయాంలో నిర్మించిన స్కూళ్లను చూపిస్తూ లోకేశ్ షోకులు పడుతున్నారని, 18 మెడికల్ కాలేజీలను పూర్తి చేయలేక కూటమి సర్కార్ చేతులెత్తేసిందని విమర్శించారు.

# తుని వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ఏర్పడింది. పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఈ గూడ్స్ రైలు, తుని పట్టణం దాటిన తర్వాత లూప్ లైన్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. రైలులోని ఒక బోగీ అదుపుతప్పి పట్టాలు తప్పి పక్కకు ఒరిగింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడం, ప్రాణ నష్టం జరగకపోవడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ప్రభావంతో విశాఖపట్నం - మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ - సికింద్రాబాద్ గరీబ్ రథ్, ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు ఇతర రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే ఉన్నతాధికారులు, సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

# ఉరేసుకున్న ప్రేమికురాలు

ఉద్రిక్తతకు దారితీసింది. గుంటూరు జిల్లా కొండ్రుపాడు గ్రామానికి చెందిన కీర్తి (26), ప్రకాశం జిల్లా పొందూరు మండలానికి చెందిన సాయి గత ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వీరి బంధం వివాహం వరకు సాగలేదు. పెళ్లి చేసుకోవాలని కీర్తి కోరగా, సాయి నిరాకరించాడని సమాచారం. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కీర్తి, జులై 14న ముంబైలోని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కీర్తి మృతదేహాన్ని ముంబై నుంచి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు, ప్రకాశం జిల్లాలోని సాయి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. తమ కుమార్తె చివరి కోరిక మేరకు సాయి ఆమె మృతదేహానికి తాళి కట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో సాయి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. ఈ క్రమంలో నిందితుడి ఇంటి గేటును పగలగొట్టి లోపలికి వెళ్లేందుకు కీర్తి కుటుంబ సభ్యులు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# వైకాపా తీరు హేయం

కాకినాడలోని జిల్లా తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ముద్రగడతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. మచ్చలేని మహానాయకుడిగా రాజకీయాల్లో ఆయన ఎదిగారు. అయితే ఎప్పటికప్పుడు స్వీయ శిక్ష వేసుకోవడం ద్వారా అనేక అవకాశాలు జారవిడుచుకున్నారు. కాపుల ఉన్నతికి, రిజర్వేషన్లకు అలుపెరుగని పోరాటం చేశారు. వైకాపా నాయకులు తమ స్వలాభం కోసమే ముద్రగడ అంత్యక్రియల సమయంలో పథకం ప్రకారమే వ్యవహరించారు. పద్మనాభం కుటుంబ సభ్యులను సంప్రదించకుండా వైకాపా నాయకులే నిర్ణయాలు తీసుకుని గందరగోళం సృష్టించారు" అని జ్యోతుల నెహ్రూ విమర్శించారు.

# ఆ సైనికుల్ని బంధించండి

కిడ్నాప్ చేయాలని ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు మనుచెహర్ మొత్తకి పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలోని అమెరికా మిలిటరీ స్థావరాలను ఆక్రమించి.. బంధించిన సైనికుల్ని ఇరాన్ తీసుకురావాలని సైన్యానికి సూచించారు. ఇందుకోసం భూతల దాడులు చేయాలని వ్యాఖ్యానించినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. గతంలోనూ మనుచెహర్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికాతో అవగాహన ఒప్పందం ఒక మోసపూరిత ప్రణాళికగా అభివర్ణించారు. "ఇస్లామాబాద్‌లో చర్చలు అంతా ఒక పథకం ప్రకారం అమెరికా పన్నిన కుట్ర. రెండు మూడు రోజుల్లో తమ ప్రణాళికను పూర్తిచేసి, ఇస్లామిక్ రిపబ్లిక్‌కు ముగింపు పలికేస్తామని భావించారు. కానీ పూర్తిగా విఫలమయ్యారు" అని విమర్శలు చేశారు. ఇరాన్‌పై దాడి చేసినందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇరాన్ డ్రోన్, క్షిపణి నిల్వలు, హర్మూజ్‌కు సమీపంలోని సైనిక స్థావరాలు లక్ష్యంగా అమెరికా దాడులు చేస్తోంది. అలాగే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ఖర్గ్ ఐలాండ్‌ను సీజ్ చేస్తామని యూఎస్ హెచ్చరికలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మనుచెహర్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# ఎడిటర్ వాయిస్

## 'జగన్ 2.0'..

## కార్యకర్తల కోసం సూపర్ యాప్

పార్టీ కంటెంట్ ను రక్షించుకోవడం, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం కోసం ఈ రూప్ రూపొందించినట్లు చెబుతున్నారు.


కార్యకర్తల కోసం వైసీపీ సరికొత్తగా 'జగన్ 2.0 సూపర్ యాప్'ను తీసుకువచ్చింది. ఈ యాప్ ను గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆవిష్కరించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అదే సమయంలో కార్యకర్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన జగన్ 2.0 యాప్ ను ఆవిష్కరించారు. పార్టీ కంటెంట్ ను రక్షించుకోవడం, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం కోసం ఈ రూప్ రూపొందించినట్లు చెబుతున్నారు.

సోషల్ మీడియా వేదికల్లో పార్టీ శ్రేణులపై జరుగుతున్న అనుచిత విమర్శలు, అసభ్యకరమైన వీడియోలు, కామెంట్లను ఎదుర్కొనేందుకు ఈ యాప్ కీలకంగా పనిచేస్తుందని వైసీపీ వర్గాలు ప్రకటించాయి. వేధింపులు ఎదుర్కొనే కార్యకర్తలు ఈ యాప్‌లోని 'డిజిటల్ డైరీ' ద్వారా నేరుగా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చునని చెబుతున్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవడానికి, ఫిర్యాదు చేసిన కంటెంట్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవడానికి ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ఎవరూ ఆపలేని విధంగా, పార్టీ సొంతంగా దీనిని అభివృద్ధి చేసిందని చెబుతున్నారు.

ఈ సూపర్ యాప్ ద్వారా పార్టీలోని ప్రతి కార్యకర్త నిత్యం పార్టీ నాయకత్వంతో కనెక్ట్ అయి ఉంటారని మాజీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు. పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అండగా ఉండటమే ఈ యాప్ ఆవిష్కరణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల భద్రత, మనోధైర్యాన్ని పెంచేందుకు ఈ యాప్ ఒక బలమైన సాధనంగా మారుతుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ చేపట్టే కార్యక్రమాలను ఈ యాప్ లో అప్ లోడ్ చేయడం ద్వారా కేడర్ మధ్య సమన్వయం పెంచొచ్చని అధిష్ఠానం భావిస్తోంది.

### ఆ నిర్ణయంలో మార్పులేదు

ఇక పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనపై మద్దతు ఇవ్వాలని గత నిర్ణయానికి కట్టుబడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంలో వెనక్కి తగ్గ కూడదని, మహిళా రిజర్వేషన్లు తమ పార్టీ విధానమని వైసీపీ నేతలు స్పష్టం చేశారు. మరోవైపు నియోజకవర్గ పునర్విభజనపై దక్షిణాదికి అన్యాయం జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. ఇక మిగిలిన బిల్లులపై కేంద్రంతో సంప్రదింపులు జరపాలని మాజీ సీఎం జగన్ రెడ్డి ఎంపీలకు సూచించారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## ఏడు నెలల చిన్నారిపై బ్లేడ్‌తో దాడి.. పరిస్థితి విషమం



### వైష్ణవి ఒంటిపై గాయాలు

**బీర్కూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాత్రి తండ్రితో కలిసి నిద్రించిన ఏడు నెలల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి బ్లేడ్‌తో దాడి చేసి పొదల్లో పడేసిన హృదయ విదారకమైన ఘటన కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో చోటుచేసుకుంది. చిన్నారి కుటుంబీకులు, బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. బీర్కూర్‌లోని ఇందిరా కాలనీకి చెందిన టేకు సతీష్, సంధ్య దంపతులకు వైష్ణవి (7 నెలలు) సంతానం. మంగళవారం రాత్రి 7:30 గంటలకు సతీష్ కుమార్తెతో కలిసి ఆరుబయట నిద్రించారు. 8 గంటల సమయంలో వైష్ణవి కనిపించకపోవడంతో భార్య వద్ద ఉంటుందనుకొని పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు నిద్ర లేచిన సతీష్.. పాప మీ దగ్గర ఉందా? అని భార్య, తల్లిని అడగడం.. వారు తమ వద్ద లేదని చెప్పడంతో ముగ్గురి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం స్థానికులు, బంధువులు చిన్నారి కోసం గాలింపు చేపట్టగా.. స్థానిక గోసంగి సంఘం భవనం సమీపంలోని పొదల్లో స్పృహ కోల్పోయి కనిపించింది. వైష్ణవి ఒంటిపై బ్లేడ్‌తో కోసిన గాయాలు ఉండటంతో వెంటనే బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు.

## వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని భర్త హత్య

### భర్త బైక్‌పైనే నిందితులతో కలిసి భార్య పరార్



**సంగనపల్లె (గుడుపల్లె), విశ్వం వాయిస్ న్యూస్ :** వివాహేతర బంధానికి అడ్డొస్తుండటంతో భర్తను గుడికని బయటకు తీసుకెళ్లి భార్య హత్య చేసిన ఘటన ఇది. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి కుప్పం డీఎస్పీ పార్థసారధి బుధవారం తెలిపిన మేరకు.. తమిళనాడులోని సూలగిరి పరిధి దేవసానపల్లెకు చెందిన రమేష్ హోసూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతనికి కుప్పం నియోజకవర్గం బోయనపల్లెకు చెందిన హాసినితో రెండేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న మౌలికశ్రీ సంతానం. సోమవారం కుటుంబమంతా బోయనపల్లెకి వచ్చి, మంగళవారం సంగనపల్లెలోని మల్లప్పకొండ మల్లేశ్వరస్వామి ఆలయానికని బైక్‌పై బయల్దేరారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో హాసిని తల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయ సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా.. మొదట భర్త, పాపతో హాసిని బైక్‌పైన ఆలయానికి వెళ్లినట్లు కనిపించింది. తిరుగు ప్రయాణంలో భర్త తెచ్చిన బైక్‌పైనే మరో ఇద్దరు యువకులతో కలిసి తిరిగి వెళు తున్నట్లు గుర్తించారు. వాటి ఆధారంగా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా మల్లప్పకొండ ఘాట్ రోడ్డు సమీపంలో రమేష్ మృతదేహం లభించింది. రమేష్ భార్యే మరో ఇద్దరితో కలిసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

## సనత్‌నగర్‌లో మైనర్ బాలికపై అత్యాచారం

**సనత్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మైనర్ బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం బాలిక పాఠశాలకు వెళ్తుండగా.. షాబాజ్ అనే వ్యక్తి ఆమెను వెంబడించి బైక్ ఎక్కించుకున్నాడు. అనంతరం సనత్ నగర్‌లోని ఓ పార్క్‌లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మ్యూల్ ఖాతాలతో రూ.వెయ్యి కోట్ల మోసం..

### టీజీసీఎస్‌బీ డీఎస్పీ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆన్‌లైన్ నేరాలతో సంపాదించిన సొమ్ముల్ని మ్యూల్ ఖాతాల్లోకి మళ్లించిన ముఠా మోసాల పరంపర అంతకంతకూ పెరిగిపోతోంది. ఈ మోసాలతో రూ.1000 కోట్లకు పైగా కొల్లగొట్టారనే అనుమానాల నేపథ్యంలో.. ఖమ్మం కమిషనరేట్‌లోని వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు సత్తుపల్లి ఠాణాల్లో నమోదైన రెండు కేసుల్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)కు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ మేరకు టీజీసీఎస్‌బీ పోలీసులు కొత్తగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టీజీసీఎస్‌బీ డీఎస్పీ కేవీఎం ప్రసాద్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని మభ్యపెట్టి బ్యాంకు ఖాతా తెరిపించారని.. ఆన్‌లైన్ నేరాల్లో కొల్లగొట్టిన సొమ్మును ఆ ఖాతాలోకి బదిలీ చేశారంటూ సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన యువకుడు ఇచ్చిన ఫిర్యాదుతో తొలుత 2025 డిసెంబరులో పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఖమ్మం కమిషనర్ సునీల్‌దత్ వినతి మేరకు వీటిని టీజీసీఎస్‌బీకి బదిలీ చేసి.. సమగ్ర దర్యాప్తు కోసం మంగళవారం సిట్‌ను ఏర్పాటు చేశారు.

## వీధికుక్కల దాడిలో వ్యక్తి దుర్మరణం

**నార్పల, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని గుంజేపల్లిలో వీధికుక్కల దాడిలో పెద్దన్న(61) అనే వ్యక్తి చనిపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దన్న అవివాహితుడు. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవటానికి గ్రామ శివారుకు వెళ్లారు. ఈక్రమంలో సుమారు పది వీధికుక్కలు ఆయనపై దాడిచేశాయి. అటువైపు వెళ్తున్న వ్యక్తులు గమనించి కుక్కలను తరిమేశారు. అప్పటికే బాధితుడు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు.








# జూలై 22న కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా

## నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 22న రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. గురువారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 22 న ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్ మేళాలో 14 ప్రముఖ సంస్థలు పాల్గొని సుమారు 1,600 ఉద్యోగాలను భర్తీ చేయనున్నాయని చెప్పారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటికే వాటిలో గణనీయమైన భాగానికి సంబంధించిన ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు.పరిశ్రమల విస్తరణతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకొని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. రాజమహేంద్ర వరం రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పొట్టిలంక వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా ఆమోదం ఇచ్చిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ వంతెన నిర్మాణంతో పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే రహదారులు, డ్రైనేజీలు, వంతెనలు, తాగునీటి వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన



మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పలు శాఖలు సమన్వయంతో చర్యలు ప్రారంభించాయని చెప్పారు.రాజమహేంద్రవరం ప్రాంతంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, భవిష్యత్తులో క్రికెట్ స్టేడియం ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర పరిధిలో అదనంగా రెండు పోలీసు స్టేషన్ల ఏర్పాటుపై కూడా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లేఅవుట్లకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరి

## కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో వేస్తున్న అన్ని లేఅవుట్లకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరిగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. గురువారం ఉదయం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. 10వ వార్డు గాదాలమ్మనగర్లో పలు లేఅవుట్లను పరిశీలించారు. ఎక్కడ ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు జరగకూడదని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా రోడ్లు, కాలువలు, నీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతనే లేఅవుట్లలో నిర్మాణాలు జరగాలన్నారు. అలాగే అనధికార లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు కూడా మోసాలకు గురికాకుండా ఉండటానికి అన్ని అనుమతులు ఉన్న ప్రాజెక్టుల్లోనే స్థలాలను కొనుగోలు చేయాలని.. తక్కువ ధరకు ఇచ్చారనో, ఆఫర్లలో వచ్చిందనో కొంటే తర్వాత ఇబ్బందులు పడతారన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఏసీపీ కొండలరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

# శివల జెడ్‌పిహెచ్ పాఠశాలలో డిజిటల్ విద్యపై అవగాహన సదస్సు




**శివల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ ల్యాబ్ ఆన్ వీల్స్ మొబైల్ సైన్స్ అవగాహన బస్సు ద్వారా శివల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విజ్ఞానం, ఏఐ, 3ఐ సాంకేతికత, సైన్స్ ప్రయోగాలు మరియు డిజిటల్ విద్యపై అవగాహన, ఆసక్తిని పెంచడమే కాకుండా, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని కలిగించారు. విద్యార్థులకు ఉచితంగా భవిష్యత్ ఉద్యోగాలకు ఉపయోగపడే కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈ కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ విలువైన అవకాశాన్ని శివల పాఠశాలకు అందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృపలాల్, నీటిపారుదల సంఘ అధ్యక్షులు నిడదవోలు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, ఎస్ఎంసీ చైర్మన్ ఇళ్ల లక్ష్మి, వైస్ చైర్మన్ పి రమేష్, ఎస్ఎంసీ సభ్యులు, సంతు కుమార్, శివ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు ఎ.నాగరాజు, సిహెచ్ ఆంజనేయులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నూతన డిఎం & హెచ్ఓ కోమలికి సత్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా డిఎం హెచ్వోగా నియమితులైన కె.కోమలిని డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. తూర్పుగోదావరి జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ కె.కోమలి పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా వారు మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందించి శాలువాతో సత్కరించారు.వైద్య శాఖలో డాక్టర్ కోమలి అందిస్తున్న సేవలను కొనియాడారు. నిరుపేద పిల్లలకు బుక్స్ పంపిణీ, పేద మహిళలకు చీరలు పంపిణీతో పాటు అనేక సేవ కార్యక్రమాలు చేస్తుంటారని పేర్కొన్నారు. వారి భర్త కె.తిలక్ కుమార్ సైతం సేవలే లక్ష్యంగా ముందుకు వెళ్తూ అందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డా.బి.జార్జి ఆంథోనీ,అధ్యక్షులు నక్కా సోమేశ్వర రావు, వైస్ ప్రెసిడెంట్ కుసుమ సాయిబాబా, హెల్త్ డిపార్ట్మెంట్ రవి కుమార్, కె.శ్యామ్ కుమార్, వై.రాజు, జీవి ప్రసాద్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పారా లీగల్ వాలంటీర్స్ పోస్టుల భర్తీకి

# రామచంద్రపురం కోర్టులో దరఖాస్తుల ఆహ్వానం

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారు రూపొందించిన పారా లీగల్ వాలంటీర్స్ పథకం కింద ఒక సంవత్సరం కాలం పాటు పని చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రామచంద్రపురం అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి బి హెచ్ వి లక్ష్మీ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు పరిధిలో గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పదవ తరగతి (మెట్రిక్యులేషన్) ఉత్తీర్ణత సాధించి, 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. అర్హత మరియు ఆసక్తి గల అభ్యర్థులు 2026 ఆగస్టు 18వ తేదీ లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థుల ఎంపిక కేవలం మౌఖిక ఇంటర్వ్యూ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పోస్టులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు మరియు ఇతర పూర్తి వివరాల కొరకు రామచంద్రపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌ను సంప్రదించాలని కోరారు.

# పిఆర్‌సి, ఐఆర్, డిఏ ఎరియర్స్ సకాలంలో విడుదల చేయాలి

## తూర్పుగోదావరి జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం తీర్మానం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పదవీ విరమణ చేసిన ఉద్యోగస్తులకు పిఆర్‌సి, ఐఆర్, డిఏ ఎరియర్స్ సకాలంలో విడుదల చేయాలని ప్రభు త్వాన్ని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం తీర్మానం చేసింది. స్థానిక ఎన్జీవో భవనములో తూర్పుగోదావరి జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం సమావేశము గురువారం ఉదయం జరిగింది. సమావేశము నకు జిల్లా అధ్యక్షులు కే.జీ. కే.మూర్తి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున భాను హాజరయ్యారు. ఈ సంద ర్భముగా జరిగిన సమావేశములో జిల్లాస్థాయి నుండి 6 మండలాల అసోసియేషన్ బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అధ్యక్షులు కే.జీ. కే.మూర్తి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో నిర్మించిన పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా భవ నమునకు సంఘం తరపున మాత్రమే పేరు ఉండాలని ఇతరుల పేర్లు ఉండరాదని సూచించగా సమావేశము ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.. రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ భవనమును ఆగస్టు 21 వ తారీకు లోపున గృహప్రవేశము చేయాలని సమావే శములో తీర్మానము చేశారు. పదవీ విరమణ చేసిన సభ్యులు మరణించిన సందర్భంలో పది రోజుల లోపల దహన ఖర్చులను సంబంధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వము అందజేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భముగా నిడదవోలు, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు మండలాల ప్రతినిధులు పెన్షనర్స్ యొక్క సమస్యలను




సమావేశములో ప్రస్తావించారు. కార్యక్రమములో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున భాను సంఘములో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వాటిని సంఘటితముగా పరిష్కరించుకోవాలని సూచించారు. గౌరవ అధ్యక్షురాలు పార్వతి, జిల్లా జనరల్ సెక్రెటరీ కె.ఎల్.ఎన్.రెడ్డి, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమములో రాజమహేంద్రవరము మున్సిపల్ కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు,, కార్పొరేషన్ పూర్వపు మేనేజర్ బి.నూకరాజు ఈ.వి.జి.ఎన్. అప్పారావు, పి.వి.వి సత్యనారాయణ, లావేటి ప్రభాకరరావు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాపు ఉద్యమనేత ముద్రగడకు అంతిమ వీడ్కోలు : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమనేత కాపు జాతి అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ముద్రగడ మృతి కాపు జాతికి రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ అన్నారు. బత్తుల కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం భౌతికకాయాన్ని సందర్శించి, ఆయన పార్థివదేహం వద్ద పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ముద్రగడ ఏ విషయాన్నైనా ముక్కుసూటిగా మాట్లాడే వారిని,అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా కాపు సామాజికవర్గం హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరి గుండెల్లో సజీవ శిల్పాలుగా ఉంటాయన్నారు.రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నా, ప్రజా సమస్యల పై ఆయనకున్న నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకం. ముద్రగడ మృతి యావత్ కాపు జాతికి, రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు యర్రంశెట్టి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

# జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ జానపద కళాకా రుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక సీపీఐ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు ఎల్.ఆర్. కృష్ణబాబు అధ్యక్షతన జరి గింది. ఈ సమావేశానికి శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు రాష్ట్రంలోని 28 జిల్లాల నుండి సుమారు 100 మందికి పైగా జానపద కళాకారుల సంఘ ప్రతినిధులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, యువ కళాకారులు హాజరై కళారంగ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్ ఆరోగ్య కారణాల దృష్ట్యా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సమావేశంలో ప్రకటించారు. ఆయన కళారంగానికి అందించిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర కమిటీ ఆయనను ఘనంగా సత్కరించింది.ఈ సమావేశాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. బుచ్చిబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీర్నాల కృష్ణ సుబ్రహ్మణ్యం. సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు బొడ్డు బుల్లెబ్బాయి, మహంతి లక్ష్మణరావు, తాళ్ల రవీంద్రబాబు, ముని శంకర్, తోట పవన్ కుమార్, పల్లి డేనియల్, ఎం. ప్రేమానందం, వేమవరపు రాంబాబు, శివజ్యోతి, లింగం శారద తదితరులు పాల్గొన్నారు.

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



యువత పారిశ్రామికవేత్తలు అవకాశాలను


# సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ పిలుపు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి పీచు (కాయిర్) ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, స్థానిక యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాలను వినియోగించుకుని కొత్త పరిశ్రమలను స్థాపించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. కాయిర్ పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, పారిశ్రామికవేత్తల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లాలో రెండు రోజుల కాయిర్ అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా కొబ్బరి తోటలు ఉండగా, ఏటా సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల కాయిర్ పిత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ప్రస్తుతం ఇందులో 10 శాతం కంటే తక్కువ మాత్రమే వినియోగంలో ఉందని, ఈ సహజ వనరులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా ఉపాధి అవకాశాలు, రైతులు, పారిశ్రామికవేత్తల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణహిత ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో కాయిర్ వుడ్, కాయిర్ పిత్ వంటి ఉత్పత్తులకు విదేశీ మార్కెట్లలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాయిర్ ఉత్పత్తుల వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని సూచించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కాయిర్ పరిశ్రమలు విజయవంతంగా అభివృద్ధి చెందిన విషయాన్ని ప్రస్తావించిన కలెక్టర్, అదే తరహాలో కోనసీమ జిల్లాలో కూడా ఈ పరిశ్రమలను విస్తరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. రాబోయే మూడు నెలల్లో జిల్లాలో కనీసం 20 నుంచి 30 కొత్త ఎంఎస్‌ఎంఈ కాయిర్ పరిశ్రమలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని, ఇందుకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తామని వెల్లడించారు. రెండు రోజుల సదస్సులో కాయిర్ పరిశ్రమల స్థాపన, యంత్రాల ఎంపిక, నిర్వహణ, మార్కెటింగ్ అవకాశాలు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సదస్సులో ఎంఎస్‌ఎంఈ ఆంధ్రప్రదేశ్ స్ట్రాటజిక్ టెక్నికల్ పార్టనర్ అజిత్ ముత్తె, యూఎన్‌డీపీ కాయిర్ కన్సల్టెంట్ ఎస్.కె. గౌతమన్, శ్రీ శ్రీ ప్లాంట్ సీఈఓ ఎన్.రావు, కేరళ కాయిర్ డెవలప్మెంట్ ప్రతినిధులు, కాయిర్ బోర్డు అధికారులు, వివిధ పరిశోధనా సంస్థల నిపుణులు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలపై వివరించారు. జిల్లా అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటు

## అమలాపురంలో కాపు రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఘన నివాళి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపం తెలియజేస్తూ గురువారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కాపు రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కాపు సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లా విష్ణుమూర్తి మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం నిస్వార్థ ప్రజానాయకుడిగా, నీతి, నిజాయితీలకు ప్రతీకగా జీవితాంతం ప్రజల కోసం కృషి చేశారని కొనియాడారు. అధికారాలు, ఆస్తులు, పదవుల కోసం రాజకీయాలు చేయకుండా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు నిలిచిన అరుదైన నాయకుడని పేర్కొన్నారు. కాపు సమాజ హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, సమాజ హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన ధైర్యవంతుడైన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీ పడకుండా నిరంతరం పోరాడిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాజకీయాల్లో విలువలకు పెద్దపీట వేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన నాయకుడిగా ముద్రగడ పద్మనాభం అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని పొందారని, కాపు సమాజానికే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇతర నాయకులు మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా రాష్ట్రానికి విశేష సేవలు అందించారని అన్నారు. ఇంటికి వచ్చిన ప్రతి వ్యక్తిని ఆప్యాయంగా ఆదరించే వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, సమాజ హక్కుల కోసం చూపిన పోరాట స్ఫూర్తి ఎప్పటికీ సజీవంగా ఉంటుందని అన్నారు. చివరగా ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు కాపు రిజర్వేషన్ పోరాట సమితి తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు నల్లా పవన్ కుమార్, కల్వకొలను తాతాజీ, నల్లా సూర్యచంద్రరావు తనయులు అజయ్, సంజయ్, కంచిపల్లి అబ్బులు, రవణం వేణు, నల్లా శ్రీధర్, సూదా గణపతి, అడపా దత్తుడు, పత్తి దత్తుడు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, ఆకుల లక్ష్మణరావు, తిక్కిరెడ్డి నేతాజీ, గంధం శ్రీను, నల్లా స్వామి, నల్లా మల్లిబాబు, రవణం కాసు, ఆకుల బుజ్జి, ఆకుల సూర్యనారాయణమూర్తి, బండి శ్రీను, గుర్రాల కన్నా, ఈబీ స్వామి, నల్లా చిన్న, కట్టా నారాయణమూర్తి, ఆదుర్తి ఆదిత్య, నల్లా చిట్టిబాబు, వివిధ పార్టీల నాయకులు, కాపు సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ముద్రగడ కుటుంబ సభ్యులను

## పరామర్శించిన పిల్లి సూర్య ప్రకాష్, చింతా అనురాధ



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నాయకుడు, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం పరమపదించిన నేపథ్యంలో కిర్లంపూడిలోని ఆయన నివాసానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల రాక కొనసాగుతోంది. ఇందులో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో వచ్చిన కార్యకర్తలతో కలిసి కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లారు. అక్కడ ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం మృతి సమాజానికి, ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. నిస్వార్థ నాయకుడిగా, ప్రజా పక్షపాతిగా ఆయన అందించిన సేవలను, ఉద్యమ ప్రస్థానాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు మరియు అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమనస వద్ద ఏడు స్కూల్ ఆటోలు సీజ్

### ఓవర్‌లోడ్, నిబంధనల ఉల్లంఘనపై రవాణా శాఖ కఠిన చర్యలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని సమనస గ్రామం వద్ద రవాణా శాఖ అధికారులు గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులను తరలిస్తున్న ఏడు స్కూల్ ఆటోలను సీజ్ చేశారు. తనిఖీల సందర్భంగా ఆటోల్లో అనుమతించిన పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడంతో పాటు, లగేజీ ఉంచాల్సిన ప్రదేశంలో చిన్నారులను కూర్చోబెట్టి అత్యంత ప్రమాదకరంగా ప్రయాణింపజేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత ఆటో డ్రైవర్లపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి (డీటీఓ) దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. పాఠశాల వాహనాలు తప్పనిసరిగా రవాణా శాఖ నిబంధనలను పాటించాలని, విద్యార్థులను ఓవర్‌లోడ్ చేయడం, ప్రమాదకరంగా ప్రయాణింపజేయడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రయాణించే వాహనాలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే స్కూల్ ఆటోలు, ఇతర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# గృహ హింసపై కేసు నమోదు : ఎస్ఐ జానీ బాషా



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్త విజయకృష్ణ, కుటుంబ సభ్యులు గృహ హింసకు గురి చేస్తున్నారంటూ ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బీమనపల్లి సింగరాయపాలేనికి చెందిన శీలం నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జానీ బాషా గురువారం తెలిపారు. 2014లో పెళ్లయిన నాటి నుంచి అదనపు కట్నం కోసం, అనుమానంతో తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని

## మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, పి.గన్నవరం ధనవర్ష ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనడానికి విచ్చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంత్రివర్యులను శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవస్థానం (అయినవిల్లి) వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై వారు పరస్పరం చర్చించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు, వ్యాపారుల సమక్షంలో

## బోణం సత్యవర ప్రసాద్ జన్మదినోత్సవ వేడుకలు





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో టీడీపీ సీనియర్ నేత, అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, సంజయ్ గాంధీ వర్తక సంఘం అధ్యక్షుడు బోణం సత్యవర ప్రసాద్ జన్మదిన వేడుకలను గురువారం ఆయన అభిమానులు, కూటమి నాయకులు, వ్యాపారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గజమాల వేసి ఘన సత్కారం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, బీజేపీ సీనియర్ నేత మోకా వెంకట సుబ్బారావు, డాక్టర్ గంధం రామం, నిమ్మకాయల రామ్మూర్తినాయుడు, పాత్రికేయులు పరసా సుబ్బారావు,ఆకుల రవితేజ, చవ్వాకుల నాని, జనిపిరెడ్డి సురేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో వ్యాపారులు, అభిమానులు, మెకానిక్ యూనియన్ నాయకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొని బోణం సత్యవర ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజాదరణను చూసి

## కూటమి ప్రభుత్వానికి వణుకు పుడుతోంది

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి భీమవరం, కిర్లంపూడి నియోజకవర్గాల పర్యటనలో భాగంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ తీవ్రంగా ధ్వజమెత్తారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు కూటమి ప్రభుత్వం ఎటువంటి ముందస్తు భద్రతా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అలాగే పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టు కుని ఉద్దేశపూర్వకంగానే భద్రతను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలను కాపాడటంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, నాయకులపై తప్పుడు కేసులు పెట్టడానికి, పోలీసులను అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయం చేయడానికి మాత్రమే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా, ఉద్రిక్తతలు పెరిగేలా కూటమి ప్రభుత్వమే వెనకుండి నడిపిస్తోందని, ప్రతిపక్ష నాయకుడి పర్యటనలను సజావుగా సాగనివ్వకుండా కుట్రలు పన్నుతోందన్నారు. జగన్ మోహన్ రెడ్డిని చూసేందుకు,ఆయన మాట వినేందుకు ప్రజలు, అభిమానులు వేలాదిగా తరలివస్తున్నారన్నారు.ఇటువంటి బహిరంగ సభల్లో కనీస ఏర్పాట్లు చేయకపోవడం వల్ల తొక్కిసలాటలు జరిగే ప్రమాదం పొంచి ఉంది. కనీసం రోప్ పార్టీలను కూడా సరిగ్గా కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. అంతే కాకుండా వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వస్తున్న అపూర్వ ప్రజాదరణను చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని కాశి రామకృష్ణ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిన్నటి పర్యటనలో జరిగిన భద్రతా లోపాలపై తక్షణమే సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయనకు అత్యున్నత స్థాయి ప్రత్యేక రక్షణ కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు కూటమి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ హెచ్చరించారు.

ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని

## పరామర్శించిన మాజీ మంత్రి విశ్వరూప్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కిర్లంపూడిలో ప్రముఖ కాపు నాయకులు దివంగత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ముద్రగడ పద్మనాభం నివాసానికి చేరుకున్న ఆయన ముద్రగడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ముద్రగడ కుమారుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు రాష్ట్ర కార్యదర్శి వంటెద్దు వెంకన్న నాయుడు, నియోజకవర్గ యువజన అధ్యక్షులు దూడల ఫణి కల్వకొలను బాబీ, కల్వకొలను ఉమ, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళిగా

# జూలై 18న కాకినాడలో సంతాప సభ

### పార్టీలకతీతంగా హాజరు కావాలని వి.వై.దాసు పిలుపు..



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళిగా ఈ నెల 18న కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో కాపు సద్భావన సంఘం, జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు సంతాప సభ నిర్వహించనున్నట్లు వి.వై.దాసు తెలిపారు. కాకినాడ కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతాప సభను పార్టీ కులమతాలకతీతంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని ముద్రగడకు నివాళులర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ముద్రగడ పద్మనాభం ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు మాత్రమే కాదని, ఆయన అందరివారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ సాధ్యమైతే అక్కడ సంతాప సభలు నిర్వహించాలని ఆయన సూచించారు. సభలో ఎవరూ వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలు వ్యక్తం చేయకుండా, కేవలం ముద్రగడ సేవలను స్మరించడానికే పరిమితం కావాలని కోరారు. ఆయనకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు ఉండేవని, ఆయనను అన్ని వర్గాల ప్రజలు అభిమానించేవారని చెప్పారు. కిర్లంపూడిలో కనిపించిన జనసంద్రం ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం వంటి ప్రజానేతను కోల్పోవడం రాష్ట్రానికి తీరని లోటని వి.వై.దాసు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సద్భావన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కాజులూరులో ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

### ఆకట్టుకున్న సంస్కృతిక కార్యక్రమాలు







**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన కాజులూరులో జగన్నాథస్వామి రథయాత్రని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాజులూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో కోలాటం ఇతర సాంస్కృతి కార్యక్రమాలతో నడుమ జగన్నాథ స్వామి భక్తులు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బోండా వెంకన్న, పార్టీలకతీతంగా నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# అనకాపల్లికి గోదావరి గలగలలు... నాగవళికి చేరేదాకా!

ఎక్కడి గోదారమ్మ ఎక్కడి అనకాపల్లి. అయినా సరే పారేందుకు ఉరకలు వేస్తోంది. అన్ని హద్దులనూ దాటుకుంటూ దాహార్తిని తీర్చేందుకు సిద్ధమవుతోంది. సాగు నీటిని అందిస్తూ పచ్చని పంటను పండించేందుకు రెడీ అవుతోంది. గోదావరి జలాలు అనకాపల్లికి తీసుకుని వచ్చేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. ఇపుడు కౌంట్ డౌన్ కూడా స్టార్ట్ అయింది. డేటూ టైం ఫిక్స్ చేసి మరీ కూటమి ప్రభుత్వ పెద్దలు గట్టిగా చెబుతున్నారు. అనకాపల్లికి గోదావరి నీటిని అందిస్తామని బిగ్ సౌండ్ చేస్తున్నారు.

**పోలవరం ద్వారా బిరబిరా :** గోదావరి బిరబిరా పారుతూ అనకాపల్లిని టచ్ చేయనుంది. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు పరుగులు తీసుకుంటూ ఈ ప్రాంతానికి రానున్నాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయని ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇస్తామని చెప్పారు. దాంతో అనకాపల్లి నుంచి ఇక ఉత్తరాంధ్రా జిల్లాలకు గోదావరి తల్లి పారుతూ సాగడమే మిగిలి ఉంది అని అంటున్నారు.

**గోదావరి నాగావళితో :** ఇక రాష్ట్రంలో నదుల అనుసంధానం జరిగితే కరవు కాటకాలు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. ఉత్తరాంధ్రాలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నాగావళి నదితో గోదావరిని కలుపుతామని ఉత్తరాంధ్రాను సస్యశ్యామలం చేస్తామని ఆయన కచ్చితంగా చెబుతున్నారు. అంతే కాదు . పెన్నా-వంశధార నదుల అనుసంధానం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నదుల అనుసంధానం పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కూడా చంద్రబాబు చెబుతున్నారు.



**సాగు నీటి ప్రాజెక్టుల మీదనే :** ఇక రాష్ట్రంలో గడచిన రెండేళ్లలో సాగు నీటి ప్రాజెక్టుల కోసం 24 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చంద్రబాబు చెప్పారు. ఇదే విధంగా వచ్చే మూడేళ్లలో 35 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. 2027 మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు చెప్పారు. అంతే కాకుండా ఇదే ఏడాది సెప్టెంబర్ నాటికి వెలుగోడు ప్రాజెక్ట్ మొదటి దశను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని కూడా బాబు వెల్లడించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం స్పష్టమైన అజెండాతో ముందుకు సాగుతోందని బాబు చెప్పారు.

# బీజేపీలో సడన్ ఛేంజ్..!! ఒక్కసారిగా ఈ మార్పు ఏంటో?

ఈ పరిస్థితుల్లో బీజేపీ భాగస్వామ్యానికి తగిన గుర్తింపు రావడం లేదని ఆ పార్టీలో అంతర్గత చర్చ జరుగుతోంది. దీంతో రాష్ట్ర నాయకత్వంలో కూడా కదలిక వచ్చిందని అంటున్నారు. ఏపీ రాజకీయాల్లో బీజేపీ వ్యవహారశైలి తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. ప్రభుత్వంలో భాగమే అయినప్పటికీ కొన్ని విషయాల్లో అంటీముట్టనట్లు ఆ పార్టీ వ్యవహరిస్తోందని అభిప్రాయం నెలకొంది. గత రెండేళ్లుగా రాష్ట్ర బీజేపీ నేతల వైఖరిని చూస్తే ఇదే విషయం తెలుస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానమైన ప్రాజెక్టులు, కూటమి నేతలపై వచ్చే విమర్శలపై బీజేపీ నేతలు పట్టనట్లు వ్యవహరిస్తుండటం వల్ల రాష్ట్రంలో కూటమి అనగానే టీడీపీ, జనసేన పార్టీలే గుర్తుకు వచ్చేలా పరిస్థితి తయారైంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చుట్టూ రాజకీయం కేంద్రీకృతమవుతోంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ భాగస్వామ్యానికి తగిన గుర్తింపు రావడం లేదని ఆ పార్టీలో అంతర్గత చర్చ జరుగుతోంది. దీంతో రాష్ట్ర నాయకత్వంలో కూడా కదలిక వచ్చిందని అంటున్నారు. ఎన్నికలకు ముందు కూటమిగా ఏర్పడిన మూడు పార్టీలు భవిష్యత్తులో కూడా మరో 15 ఏళ్లు కలిసి పనిచేస్తామని చెబుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి మూడు పార్టీలు కలిసిమెలిసి ఉండాలని నేతలు తరచూ ప్రకటనలు చేస్తున్నారు. అయితే ఈ విషయంలో బీజేపీ నుంచి పెద్దగా సౌండ్ వినిపించడం లేదనే అభిప్రాయం ఉంది. రాష్ట్రంలో ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే సమయంలో టీడీపీ, జనసేనతో పాటు బీజేపీని భాగస్వామ్యం చేస్తున్నారు. అయితే ఆయా పథకాలు, పనులను ఓన్ చేసుకోవడంలో బీజేపీ వెనకబడిందనే అభిప్రాయమే ఎక్కువ నెలకొంది. కూటమిలో ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ యాక్టివ్ గా పనిచేస్తూ ప్రతి పథకం, ప్రాజెక్టుపై తరచూ మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేస్తున్న పనులను వివరిస్తున్నారని అంటున్నారు. కానీ, బీజేపీ నేతలు మాత్రం ఈ విషయంలో మాట్లాడటం లేదని, దీంతో కూటమిలో బీజేపీ పాత్ర నామమాత్రంగా ఉందనేలా పార్టీ నేతలే అవకాశం ఇస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీలో ప్రస్తుతం అనూహ్య మార్పు మొదలైందని అంటున్నారు. కేంద్ర నాయకత్వం ఆదేశాలో.. క్షేత్రస్థాయి కార్యకర్తల అంతర్గత సమాచారమో కానీ బీజేపీ రాష్ట్ర పెద్దలు ప్రభుత్వ వ్యవహారాలను సొంతం చేసుకునేలా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. దీనికి తాజా ఉదాహరణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పోలవరం ప్రాజెక్టు సందర్శనే అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలో పోలవరం పనులు పరిగెట్టిస్తున్నారు. 2014-19 మధ్య 72 శాతం పూర్తయిన ఈ ప్రాజెక్టు ఆ తర్వాత ఐదేళ్లు ముందుకు కదల్లేదని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును 89 శాతం పూర్తిచేసినట్లు సీఎం చంద్రబాబు స్వయంగా వెల్లడించారు. అంతేకాకుండా వచ్చే మార్చినాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేసేలా పనులు పూర్తి చేస్తామని కూడా వెల్లడించారు. దీంతో బీజేపీ నాయకత్వం కూడా మేల్కొందని అంటున్నారు. కేంద్ర నిధులతో నిర్మిస్తున్న పోలవరం క్రెడిట్ మొత్తం టీడీపీ వేసుకుంటోందని గ్రహించిన బీజేపీ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం, బీజేపీకి కూడా భాగస్వామ్యం ఉందనే కోణంలో ప్రచారం చేసేందుకు రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ను పంపిందని అంటున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో మిగిలిన రెండు పార్టీలకు సమానంగా బీజేపీకి క్రెడిట్ దక్కేలా మునుముందు నడుచుకోవాలని రాష్ట్ర బీజేపీకి స్పష్టమైన సూచనలు వచ్చాయని చెబుతున్నారు.

# సమర్థంగా పోక్సో చట్టం

### సీఎస్ డీజీపీలకు పవన్ కీలక లేఖ



ఏపీలో పోక్సో చట్టం 2012ని సమర్ధంగా అమలు చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు లేఖ రాశారు. ప్రతి బిడ్డకూ భద్రత గౌరవం న్యాయం పొందే హక్కు ఉందని అంటూ పవన్ ఆ లేఖలో అనేక అంశాలను ప్రస్తావించారు. అంతే కాదు చిన్నారులకు సకాలంలో న్యాయంతో పాటు మెరుగైన రక్షణ కల్పించేందుకు పవన్ ఈ లేఖలో పలు కీలక సూచనలు సైతం చేశారు.

**సమయ పాలన ముఖ్యమంటూ :** ఇక పోక్సో కేసుల దర్యాప్తు అలాగే ఛార్జిషీట్ దాఖలును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన కోరడం జరిగింది. నిందితుల బెయిల్ పిటిషన్ల విషయంలో ప్రాసిక్యూషన్ బలమైన వాదనలు వినిపించి బెయిల్‌ను తీవ్రంగా వ్యతిరేకించాలని సూచించారు. అదే విధంగా బాధితుల రక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడంతో పాటు ప్రతి జిల్లాలోనూ పర్యవేక్షణ సెల్ ఏర్పాటు చేయాలని పవన్ కోరారు. దర్యాప్తు అధికారులకు చిన్నారులతో ఎలా వ్యవహరించాలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కూడా పేర్కొన్నారు.

**సమగ్ర దర్యాప్తు అవసరం :** ఇక ఈ లేఖలో భాగంగా నెల్లూరు జిల్లా రెహ్మతాబాద్ దర్గా వ్యవహారాన్ని ప్రత్యేకంగా పవన్ ప్రస్తావించారు. పోక్సో కేసు విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తి దర్గా బాధ్యతలలో కొనసాగడంపై వక్ఫ్ బోర్డు అలాగే జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కూడా పవన్ సూచించారు. ఈ అంశాలపై తక్షణ చర్యలు తీసుకుని 30 రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ నివేదికను సమర్పించాలని ఆయన ఆదేశించారు.

**షాబాద్‌లో పోక్సో కేసు ప్రస్తావన :** ఇదిలా ఉంటే తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో పోక్సో కేసులో అరెస్ట్ అయిన వ్యక్తి తర్వాత బెయిల్ మీద వచ్చి ఏకంగా బాధితురాలి కుటుంబసభ్యులను వారితో పాటుగా తన సొంత కుటుంబాన్ని కడతేర్చిన ఘటనను పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించడం విశేషం. ఏపీలో చూస్తే నెల్లూరు జిల్లా రెహమతాబాద్ దర్గా ఘటనను కూడా పవన్ ఆ లేఖలో ప్రస్తావించడం జరిగింది. ఇదే విషయం మీద మ్యుస్లిం మత పెద్దలు,అలాగే ముస్లిం సభ్యులు స్థానిక నివాసితుల నుంచి తన కార్యాలయానికి అనేక వినతులు వచ్చినట్లుగా పవన్ కళ్యాణ్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ దర్గాకు వంశపారంపర్యంగా అధిపతిగా ఉన్న ఒక వ్యక్తి పోక్సో విచారణను ఎదుర్కొంటున్నారని అయినా ఆయన విధులు నిర్వహిస్తున్నారు అని పవన్ గుర్తు చేశారు. అందుకే ఇటువంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్న కేసులలో అసలు విషయాన్ని పోలీసులు ఏపీ వక్ఫ్ బోర్డుకు జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని పవన్ సూచించారు.

**ఇవన్నీ ఆందోళనకరం :** తెలంగాణాలోని షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలను పవన్ పేర్కొంటూ పోక్సో కేసులలో నిందితులు బాధితులను వారి కుటుంబాలను భయపెడుతున్నారని శారీరకంగా హింసించడం వంటి ధోరణి పెరిగితే అది ఎంతో ఆందోళన కలిగించే విషయం అని పవన్ పేర్కొన్నారు. కఠినమైన సెక్షన్లు పెట్టినా బెయిల్ మీద షాబాద్ కేసు నిందితుడు బయటకు వచ్చాడని క్రూరంగా ఆరుగురిని చంపేశాడు అని పవన్ లేఖలో గుర్తు చేశారు.

**కట్టుదిట్టంగా ఉండేలా :** ఇక పోక్సో కేసులలో బాధితులకు తగిన రక్షణ లేకపోవడం మీద కూడా పవన్ ఈ లేఖలో సీఎస్ డీజీపీ దృష్టికి తీసుకుని వచ్చారు. బెయిల్ పరిశీలించే విషయంలో కఠినంగా వ్యహరించలేకపోవడం తదనంతర విపత్కర పరిస్థితులకు దారి తీస్తోంది అని పవన్ లేఖ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి చోటు చేసుకోరాదని పవన్ కోరారు షాబాద్ ఘటన తెలుగు రాష్ట్రాలనే కాదు దేశమంతా ప్రకంపనలు సృష్టించింది. పవన్ తన శస్త్ర చికిత్సను ముంబై ఆసుపత్రిలో చేయించుకుని తిరిగి రాగానే ఇదే అంశం ప్రస్తావిస్తూ పోక్సో కేసుల విషయంలో కట్టుదిట్టంగా వ్యవహరించాలని అధికార యంత్రాంగాన్ని కోరడం ఇపుడు చర్చనీయాంశం అయింది.

# పోలీసుల మీదకు దూసుకెళ్లిన అంబటి



కాకినాడ జిల్లా కిర్లంపూడిలో జరిగిన మాజీ మంత్రి కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో ప్రభుత్వ లాంచనాలు తమకు వద్దు అని ముద్రగడ కుటుంబం తెగేసి చెప్పింది. అయితే ప్రభుత్వం ఆదేశించినట్లుగా పోలీసులు ముద్రగడ అంత్యక్రియలు జరిగే కిర్లంపూడి లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. అక్కద సంప్రదాయం ప్రకారం ప్రభుత్వ లాంఛనాలతో కూడిన తుపాకీ వందనం కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభిస్తుండగా ఒక్కసారిగా ముద్రగడ అభిమానులు నాయకులు వారి దగ్గరకు వచ్చి ఆపేయాలని డిమాండ్ చేశారు.

**పోలీసుల మీదకు అంబటి :** ఇక ఇదే సమయంలో వైసీపీ సీనియర్ నాయకుడు అంబటి రాంబాబు జోక్యం చేసుకుని పోలీసులను బలంగా తోసేశారు. కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా ఈ వందనం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తూ, ఆ కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నంలో ఆయన పోలీసులను తోసివేయడంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అంత్యక్రియల సమయంలో అంబటి రాంబాబుకు పోలీసులకు మధ్య జరిగిన వాగ్వాదం అయితే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

**పోలీస్ వర్సెస్ అంబటి :** పోలీసుల మీద ఆగ్రహం వ్యక్తం చేసిన అంబటి ఒక పోలీసుని వెనక్కి నెడుతూ వెళ్ళడం కూడా సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. అంతకు ముందు వైసీపీ నాయకులు పోలీసుల మధ్య ఇదే విషయం మీద గొడవ జరిగింది. అయితే ఈ మధ్యలో అంబటి రాంబాబు అక్కడికి చేరుకుని శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసులను ఇదే విషయం మీద నిలదీశారు. ముద్రగడ అంత్యక్రియలు అధికారిక ప్రభుత్వ లాంఛనాలతో వద్దు అని చెప్పినా ఎందుకు నిర్వహిస్తున్నారు అని అంబటి ప్రశ్నించడం జరిగింది. దీంతో అంత్య క్రియలలో గందరగోళం ఏర్పడింది.

**వద్దు అంటూ రాద్ధాంతం :** ఒక వైపు ముద్రగడ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో వైపు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పోలీసులు వచ్చారు. మీడియా ముఖంగానే వైసీపీ నేతలు ప్రభుత్వం లాంచనాలు వద్దు అని చెప్పడం జరిగింది. అయితే యధా ప్రకారం వచ్చిన పోలీసులు తన విధులను నిర్వహిస్తూండగా ఈ విధంగా వివాదం జరగడం మీద చర్చ సాగుతోంది. ఇందులో పోలీసుల తప్పేముంది అంటూ నెటిజన్ల మధ్య చర్చ కూడా నడచింది. ప్రభుత్వం ఆదేశాలను వారు అమలు చేయాల్సి ఉంటుంది కదా అంటున్నారు. మొత్తానికి ఏదైతేనేమి ముద్రగడ అంత్యక్రియలు ప్రభుత్వ లాంచనాలతో జరిగిపోవడమే విశేషం.



# ఎమ్మెల్యే "ఆదిరెడ్డి" ప్రజలతో ముఖాముఖి

## సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం లో భాగంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) 24, 25 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కారానికి చర్యలు ప్రారంభించడంతో కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బుధవారం రాత్రి పార్టీ సీనియర్ నాయకుడు కర్రి కాశీ నివాసంలో బస చేసిన ఎమ్మెల్యే వాసు, గురువారం ఉదయం ప్రజలతో కలిసి ఆయా డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే నేరుగా ఫోన్‌లో మాట్లాడి, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం పట్ల స్థానికులు ఎమ్మెల్యే వాసును అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



### మారేడుబాక మావుళ్ళమ్మ తల్లిని

# దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల

**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలంలోని మారేడుబాక గ్రామంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీశ్రీశ్రీ మావుళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఆయన కుమారుడు అజయ్ కుమార్ తో కలసి గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళకు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వీరు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ గ్రామ దేవతల జాతరలు గ్రామీణ సంస్కృతికి, ఐక్యతకు ప్రతీకలని కొనియాడారు. మారేడుబాక మావుళ్ళమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహిస్తున్న గ్రామ పెద్దలను, కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పుట్టా శ్రీనివాస్, రాయుడు గంగరాజు, మార్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సీతానగరం మండలంలో మరణించిన వారి పలు కుటుంబాలను

# పరామర్శించిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పలు గ్రామాలలో. మృతి చెందిన వారి కుటుంబాలను జన సేన పార్టీ నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పరామర్శించారు. వెదుళ్ళపల్లి గ్రామానికి చెందిన తన్నీరు సురేష్ తండ్రి తన్నీరు నాగేశ్వరరావు, దార్ల శ్రీనివాస్, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన రామచంద్రపురం సొసైటీ చైర్మన్ మండ వెంకటేశ్వరరావు తండ్రి మండ నాగేశ్వరావు,సీతానగరం గ్రామానికి చెందిన మద్దుకూరి వెంకట రామారావు కుమారుడు శేఖర్ ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరి వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోకవరం బస్టాండ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

## రూ.3 లక్షల వ్యయంతో ప్రయాణికుల కోసం మినరల్ వాటర్ సౌకర్యం
## త్వరలో రెండు అంబులెన్సులు కూడా: బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు





**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే తరహాలో మరో ఐదు నియోజకవర్గాల్లోని బస్టాండ్లలో కూడా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చే కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు. అలాగే గోకవరం మండల ప్రజలకు త్వరలోనే రెండు నూతన అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువస్తామని కంబాల శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రస్తుతం అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కోసం నిరుపేదలు భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని, ఇకపై అలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత లేదా అందుబాటు సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. "గోకవరం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఢిల్లీ స్థాయిలో గుర్తింపు పొందేలా చేస్తాను" అని కంబాల శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. మండలంలోని కాలనీలు ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, పరిశుభ్రతతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ అధికారులు, ప్రయాణికులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఆర్వా వాటర్ ప్లాంట్ ప్రారంభాన్ని స్వాగతించారు.





### మునికూడలిలో మ్యాజిక్ డ్రైన్, కమ్యూనిటీ సోక్ పిట్

# పనులను పరిశీలించిన అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ ఎం. శివప్రసాద్, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి. గోపీ చంద్ మ్యాజిక్ డ్రైన్ మరియు సోప్ పిట్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ. నాగమహేశ్వరరావు, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ జె.వి.వి.బి సురేష్,జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ఎస్ నరేష్ బాబు,ఎంపిడిఓ భారతి,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్,ఏపీవో సత్యవతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హనుమ,పంచాయతీ సెక్రటరీ, టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్ పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ముద్రగడ సంస్మరణ సభలు నిర్వహించాలి



**కాపు సంఘాలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపు**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్మారకార్థం రాష్ట్రవ్యాప్తంగా సంస్మరణ సభలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర స్థాయి కాపు నాయకుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ముద్రగడకు కాపు జాతి అందించే నిజమైన నివాళి సంస్మరణ సభలేనని ఆయన పేర్కొన్నారు. కాపు రిజర్వేషన్ల సాధన, కాపు సామాజిక వర్గ అభ్యున్నతి కోసం ముద్రగడ పద్మనాభం తన జీవితాన్ని అంకితం చేశారని తోట కొనియాడారు. ఆయన చేసిన సేవలను కాపు జాతి ఎన్నటికీ మరచిపోదని, ముద్రగడ ఎప్పటికీ కాపుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ముద్రగడ తన అంత్యక్రియల సందర్భంగా దిన కార్యక్రమాలు నిర్వహించవద్దని కోరిన విషయాన్ని గుర్తు చేసిన తోట, అయినప్పటికీ ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి కాపు సంఘం, కాపుల బాధ్యత అని అన్నారు. ముద్రగడ ఏనాడూ స్వలాభం కోసం పనిచేయలేదని, జాతి ప్రయోజనాలు, సామాజిక శ్రేయస్సు కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని కాపు సంఘాలు తమ శక్తి మేరకు సంస్మరణ సభలు నిర్వహించాలని, వీలైన చోట తాను కూడా హాజరవుతానని తోట తెలిపారు. ఉద్యమంలో ముద్రగడతో కలిసి పనిచేసిన నాయకులందరినీ ఆ సభలకు ఆహ్వానించాలని కోరారు. ముద్రగడ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించడంపై రాజకీయ వ్యాఖ్యలు చేయడాన్ని తోట తప్పుబట్టారు. మాజీ మంత్రిగా సేవలందించిన ప్రతి నాయకుడికి ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా, ముద్రగడ సేవలను గుర్తించి గౌరవించడం అందరి బాధ్యత అని తోట పేర్కొన్నారు.

### శాంతి భద్రతల పరిరక్షణలో

# పోలీసులకు సహకరించాలి

## డ్రగ్స్, మద్యం, బెట్టింగ్, పేకాటకు దూరంగా ఉండాలి - సీఐ పి.దొరరాజు




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు పిలుపునిచ్చారు. రాయవరం మండలం కూర్మాపురం గ్రామంలో గురువారం రాయవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి. సురేష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు "కనెక్ట్ యూత్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దొరరాజు మాట్లాడుతూ, ప్రస్తుతం యువతలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, చదువు, ఉపాధి, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్సై సురేష్‌బాబు మాట్లాడుతూ, యువత గంజాయి, మద్యం, క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి సామాజిక రుగ్మతలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు వంటి సత్ప్రవర్తన వైపు అడుగులు వేయాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### షైనింగ్ స్టార్స్-2026 అవార్డులకు

# తాపేశ్వరం శ్రీ చైతన్య విద్యార్థులు




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** 2025-26 విద్యా సంవత్సరం పది ఫలితాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ 2026అవార్డులకు తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపిక య్యారు. మండలంలో మొత్తం 8 మందికి ఈ అవార్డులు రాగా, వాటిలో 7 గురు ఒకే పాఠశాల నుంచి రావడం పట్ల ప్రిన్సిపాల్ జి. లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు.పవిత్ర 598 మార్కులు,మేఘన 597 మార్కులు,వర్షిత్ 597 మార్కులు,తనోజ్ 597 మార్కులు,శ్రీ ఉమ 596 మార్కులు, చరణ్ రెడ్డి 596 మార్కులు,దేవి సౌజన్య 594 మార్కులు పొందారు.రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులకు త్వరలో జిల్లా కలెక్టర్ రూ.20,000 నగదు బహుమతి, షీల్డ్ అందజేయనున్నారు. ప్రతి ఏటా తమ విద్యార్థులు ఎస్ఎస్‌సిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాక, ప్రభుత్వ షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక కావడం పాఠశాల నాణ్యమైన విద్యకు నిదర్శనమని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# టిడిపి నాయకులు మండ రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన అభిరామ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మండ రాంబాబు తండ్రి మండ నాగేశ్వరరావు ఇటీవల మరణించడం జరిగింది. రాజానగరం తెలుగుదేశం మాజీ శాసనసభ్యులు సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ (క్యాబినెట్ మినిస్టర్ ర్యాంక్)పెందుర్తి వెంకటేష్ తనయుడు రాజానగరం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ పురుషోత్తపట్నం మండ రాంబాబు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరియు ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు. పరామర్శించిన వారిలో అభిరామ్ తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్..

**డార్లింగ్ కొత్త సినిమా రిలీజ్ డేట్ వచ్చేసింది.. పోస్టర్ అదిరిపోయిందిగా..**

ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్. ఫ్యాన్స్ అంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫౌజీ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు మేకర్స్. ఈ క్రమంలోనే తాజాగా విడుదలైన కొత్త పోస్టర్ అదిరిపోయింది. ఇంతకీ థియేటర్లలోకి ఫౌజీ ఎప్పుడు వస్తున్నాడో తెలుసా..? ఈ చిత్రానికి డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే తీపి కబురు వచ్చేసింది. ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఫౌజీ' సినిమా రిలీజ్ డేట్ ఎట్టకేలకు లాక్ అయిపోయింది. బాక్సాఫీస్ దగ్గర మరోసారి రికార్డుల వేట మొదలుపెట్టేందుకు డిసెంబర్ 3న ఈ గ్రాండ్ మూవీ థియేటర్లలోకి అడుగుపెట్టబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించేశారు. వరుస పాన్ ఇండియా సినిమాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న డార్లింగ్.. ఈసారి డైరెక్టర్ హను రాఘవపూడితో చేతులు కలపడంతో ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ రోజు నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇప్పుడు రిలీజ్ డేట్ కూడా ఫిక్స్ కావడంతో ఫ్యాన్స్ సంబరాలు మొదలుపెట్టేశారు. 'సీతా రామం' లాంటి ఎవర్ గ్రీన్ క్లాసిక్ లవ్ స్టోరీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన డైరెక్టర్ హను రాఘవపూడి, ఈసారి అంతకుమించిన భారీ కాన్వాస్‌ను ఎంచుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన యాక్షన్ పీరియడ్ లవ్ స్టోరీగా 'ఫౌజీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. హను మార్క్ వింటేజ్ రొమాన్స్‌కు ప్రభాస్ కటౌట్, హై-వోల్టేజ్ యాక్షన్ తోడైతే వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ అవుతుందో అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో సాగే ప్రేమకథ కాబట్టి, ఇందులో యాక్షన్‌తో పాటు హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు కూడా అదే స్థాయిలో ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో ప్రభాస్ సరసన అందాల భామ ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రభాస్ పక్కన ఒక సరికొత్త ముఖాన్ని చూడబోతుండటంతో ఈ పెయిరింగ్‌పై ఇండస్ట్రీలో మంచి క్యూరియాసిటీ నెలకొంది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఎక్కడా ఖర్చుకు వెనుకాడకుండా నిర్మిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్, ఆర్ట్ వర్క్, యాక్షన్ సీక్వెన్సుల కోసం అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం నాటి కాలమానాన్ని కళ్లకు కట్టేలా భారీ సెట్లు నిర్మించి, సినిమాను ఒక విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం.. ప్రభాస్ కెరీర్‌లోనే మరో మైలురాయిగా నిలిచిపోతుందని చిత్ర యూనిట్ ధీమాగా ఉంది. ఒకవైపు కటౌట్‌కు తగ్గ యాక్షన్, మరోవైపు మనసుకు హత్తుకునే సున్నితమైన ప్రేమకథ సమానంగా ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా ఆకట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో 'ఫౌజీ' సృష్టించబోయే బాక్సాఫీస్ సునామీ కోసం ఇటు రెబల్ స్టార్ అభిమానులతో పాటు అటు కామన్ ఆడియన్స్ కూడా క్యాలెండర్‌లో డేట్ మార్క్ చేసుకొని మరీ ఎదురుచూస్తున్నారు.

# శ్రీలీలకు షాకిచ్చిన యంగ్ హీరోయిన్..


**స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కొట్టేసిన తమిళ్ బ్యూటీ..**



టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది హీరోయిన్ శ్రీలీల. తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకున్న ఆమె.. ఆ తర్వాత వరుస ప్లాపులు మూటగట్టుకుంది. అయితే ఇటీవలే లెనిన్ సినిమా నుంచి తప్పుకుని సూపర్ హిట్ మిస్సైంది ఈ అమ్మడు. ఇక ఇప్పుడు ఈ బ్యూటీకి మరో షాక్ తగిలినట్లు తెలుస్తుంది. తాజాగా స్ట?ర్ హీరో సినిమాలో ఛాన్స్ మిస్సైనట్లు తెలుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ సినిమాలకు ఉండే క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. చివరగా గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు అజిత్. ఆ తర్వాత మరో సినిమా చేయలేదు. చాలా కాలంగా బ్రేక్ తీసుకున్న అజిత్ కొత్త సినిమాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. గుడ్ బాడ్ అగ్లీ సినిమా డైరెక్ట్ర అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలోనే అజిత్ మరో సినిమా చేయనున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం అజిత్ తన కార్ రేసు పోటీలపై దృష్టి పెట్టారు. ఈ సినిమా గురించి నిత్యం ఏదోక వార్త సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుంది. ఈ సినిమాను కోయంబత్తూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నిర్మిస్తున్నట్లు సమాచారం. అలాగే ఇందులో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేశారని ప్రచారం నడుస్తుంది. తాజాగా ఈ మూవీలోకి మరో భామ వచ్చిందని టాక్. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈసినిమా నుంచి శ్రీలీల తప్పుకుందట. డేట్స్ కుదరకపోవడంతో ఈ మూవీ నుంచి ఆమె తప్పుకున్నట్లు టాక్ నడుస్తుంది. అయితే ఈ సినిమాను నుంచి శ్రీలీల తప్పుకోవడం కాదు.. తప్పించారని.. ఆమె స్థానంలోకి మరో ముద్దుగుమ్మ కయాదు లోహర్ ను తీసుకున్నారని ఫిల్మ్ వర్గాల్లో టాక్. ఇప్పటికే లెనిన్ సినిమా నుంచి తప్పుకుని సూపర్ హిట్ మిస్ చేసుకుంది శ్రీలీల. ఇక ఇప్పుడు అజిత్ 64వ చిత్రాన్ని సైతం మిస్సైనట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మరో బ్యూటీ స్వాసిక నటించనున్నట్లు టాక్. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.

# ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి భారత్ తడబాటు..

**233 పరుగులకే టీమిండియా ఆలౌట్**



కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ హాఫ్ సెంచరీలు చేసినప్పటికీ టీమిండియా 233 పరుగులకే ఆలౌటైంది. జోఫ్రా ఆర్చర్, సాకిబ్ మహమూద్ ధాటికి భారత బ్యాటింగ్ తడబడింది. ఇప్పుడు సిరీస్‌లో రెండో మ్యాచ్ ఫలితంపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య కార్డిఫ్ వేదికగా జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు గట్టి షాక్ తగిలింది. ఇంగ్లాండ్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ దాటికి భారత బ్యాటింగ్ ఆర్డర్ తలవంచక తప్పలేదు. నిర్ణీత 44 ఓవర్లలో భారత్ 233 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మొదటి వన్డేలో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉన్న భారత్, ఈ మ్యాచ్‌లో మాత్రం భారీ స్కోరు చేయలేకపోయింది. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, సాకిబ్ మహమూద్ భారత బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టారు.భారత ఇన్నింగ్స్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన క్లాస్ ఆటతీరును ప్రదర్శించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా పట్టుదలగా ఆడిన కోహ్లీ 66 బంతుల్లో 65 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో 8 ఫోర్లు ఉన్నాయి. అతనికి తోడుగా శ్రేయస్ అయ్యర్ కూడా అద్భుత పోరాటం చేసి హాఫ్ సెంచరీ మార్కును దాటాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు కీలకమైన హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. అయితే జట్టు స్కోరు 190 పరుగుల వద్ద ఉన్నప్పుడు విరాట్ కోహ్లీని జోఫ్రా ఆర్చర్ అవుట్ చేయడంతో భారత్ కోలుకోలేకపోయింది.

ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్లు జట్టుకు ఆశించిన స్థాయిలో మంచి భాగస్వామ్యాన్ని ఇవ్వలేకపోయారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 30 బంతుల్లో 31 పరుగులు చేసి అట్కిన్సన్ బౌలింగ్‌లో ఎనిమిదో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. మరో ఓపెనర్ రోహిత్ శర్మ కాస్త నెమ్మదిగా ఆడి 47 బంతుల్లో 26 పరుగులు మాత్రమే చేసి విల్ జాక్స్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. కేఎల్ రాహుల్ స్థానంలో జట్టులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ ఈషాన్ కిషన్ కేవలం ఒక పరుగు మాత్రమే చేసి సామ్ కరన్ బౌలింగ్‌లో దొరికిపోయాడు. దీనితో 21 ఓవర్లకే భారత్ మూడు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఇన్నింగ్స్ మధ్యలో శ్రేయస్ అయ్యర్ ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికీ లోయర్ ఆర్డర్ నుంచి అతనికి సరైన మద్దతు లభించలేదు. వాషింగ్టన్ సుందర్ 5 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసి సాకిబ్ మహమూద్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఆ తర్వాత 36వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన జోఫ్రా ఆర్చర్ వరుస బంతుల్లో అక్షర్ పటేల్, శివమ్ దూబేలను అవుట్ చేసి భారత్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. అక్షర్ ఒక పరుగు చేయగా, దూబే కనీసం ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఆఖర్లో గుర్నూర్ బ్రార్ 15 బంతుల్లో 7 పరుగులు చేసి ఎనిమిదో వికెట్‌గా అవుటయ్యాడు. చివరి వికెట్లకు పరుగులు రావడం కష్టంగా మారిన సమయంలో టీమిండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బ్యాట్‌తో అద్భుత విన్యాసాలు చేశాడు. సాకిబ్ మహమూద్ వేసిన ఓవర్లో బుమ్రా రెచ్చిపోయి ఆడాడు. ఆ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు, ఒక భారీ సిక్సర్ బాది ఏకంగా 18 పరుగులు రాబట్టాడు. బుమ్రా వేగంగా ఆడటం వల్లే భారత్ స్కోరు 230 దాటగలిగింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ బౌలింగ్‌కు అనుకూలిస్తుందనే అంచనాతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. దానికి తగ్గట్టుగానే వారి బౌలర్లు రాణించారు. ఈ మ్యాచ్ కోసం రెండు జట్లు తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో మార్పులు చేశాయి. ఇంగ్లాండ్ జట్టులో జోష్ టంగ్, లియామ్ డాసన్ స్థానాల్లో సాకిబ్ మహమూద్, గస్ అట్కిన్సన్‌లకు అవకాశం దక్కింది. భారత్ తరఫున గాయపడిన కేఎల్ రాహుల్ స్థానంలో ఈషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకున్నారు.

# భారత పేసర్ గుర్నూర్ బ్రార్ ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్



భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ఐసీసీ ఆగ్రహానికి గురయ్యాడు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డే సమయంలో అనుచితం గా ప్రవర్తించినందుకు అతడికి ఆర్టికల్ 2.9 లెవల్ 1 ప్రకారం అధికారిక హెచ్చరికతోపాటు ఓ డీమెరిట్ పాయింట్‌ను జరిమానాగా ఎదుర్కొన్నాడు. 24 నెలల వ్యవధిలో అతడికిదే తొలి తప్పిదం కాబట్టి.. తక్కువ శిక్షతోనే బ్రార్ బయటపడ్డాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ప్రపోజ్ చేయగా.. బ్రార్ తన తప్పును అంగీకరించాడు. దీంతో అతడి వివరణను తీసుకున్న ఐసీసీ సదరు తప్పిదానికి చర్యలు తీసుకుంది.

**బంతి విసిరేసి..**

తొలి వన్డేలో ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ బ్యాటింగ్ చేస్తుండగా.. బ్రార్ బౌలింగ్‌కు వెళ్లాడు. బెన్ డకెట్ అంతకుముందు బంతిని బౌండరీగా మలచడంతో బ్రార్ కాస్త అసహనానికి గురయ్యాడు. తర్వాత బాల్‌ను బ్రార్ వద్దకే డకెట్ కొట్టాడు. వెంటనే ఆ బంతి తీసుకొని డకెట్‌కు కాస్త పక్కగా విసిరాడు. దీనిని తప్పిదంగా పరిగణించిన రిఫరీ జరిమానా విధించాలని ఐసీసీ కమిటీకి సూచించాడు. లెవల్ 1 ఉల్లంఘనలకు సాధారణంగా అధికారిక హెచ్చరికతోపాటు ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది.

**గతంలోనూ ఇదే తప్పు.. ఆ ఒక్క బ్యానర్ వల్ల**

# అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టుకు భారీ షాక్?




ఇంగ్లండ్‌పై విజయం తర్వాత ఫాక్‌లాండ్ దీవులకు సంబంధించిన వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించిన అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టు మరోసారి ఫిఫా దృష్టిలో పడింది. గతంలో భారీ జరిమానా ఎదుర్కొన్న అర్జెంటీనాపై ఈసారి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మైదానంలో ఆట ఆడేటప్పుడు ఆటగాళ్లు కేవలం క్రీడా స్ఫూర్తిని మాత్రమే ప్రదర్శించాలి. కానీ ఇంగ్లండ్‌పై సాధించిన ఒక పెద్ద విజయం తర్వాత అర్జెంటీనా ఫుట్‌బాల్ ఆటగాళ్లు అతిగా ప్రవహించి కొత్త వివాదానికి తెరలేపారు. మ్యాచ్ గెలిచిన ఆనందంలో వారు మైదానంలో వేడుకలు చేసుకుంటూ ఇంగ్లండ్ దేశాన్ని కించపరిచేలా ఒక వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయ క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ రాజకీయ వివాదంపై ప్రపంచ ఫుట్‌బాల్ నియంత్రణ సంస్థ అయిన ఫిఫా కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అర్జెంటీనా ఆటగాళ్లు ప్రదర్శించిన ఆ బ్యానర్‌పై స్పానిష్ భాషలో లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని రాసి ఉంది. దీని అర్థం "మాల్వినాస్ (ఫాక్‌లాండ్ దీవులు) అర్జెంటీనా దేశానికి చెందినవి" అని అర్థం. బ్రిటన్, అర్జెంటీనా దేశాల మధ్య ఈ ఫాక్‌లాండ్ దీవుల విషయంలో కొన్ని దశాబ్దాలుగా తీవ్రమైన భూభాగ వివాదం నడుస్తోంది. అర్జెంటీనా తూర్పు తీరానికి దాదాపు 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ దీవులను బ్రిటన్ తన పరిపాలనలో ఉంచుకుంది. కానీ అర్జెంటీనా మాత్రం ఇవి తమవేనని వాదిస్తూ వస్తోంది. ఈ ఫాక్‌లాండ్ దీవుల యాజమాన్యం కోసం 1982లో బ్రిటన్, అర్జెంటీనా దేశాల మధ్య ఒక పెద్ద యుద్ధమే జరిగింది. ఆ భీకర యుద్ధంలో అర్జెంటీనాకు చెందిన 655 మంది సైనికులు, బ్రిటన్‌కు చెందిన 255 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చివరకు ఆ యుద్ధంలో అర్జెంటీనా ఓటమిని అంగీకరించక తప్పలేదు. నాటి నుంచి నేటి వరకు ఆ దీవులపై బ్రిటన్ తన పూర్తి పరిపాలనా నియంత్రణను కొనసాగిస్తోంది. అయినప్పటికీ అర్జెంటీనా మాత్రం నేటికీ ఆ భూభాగం తమదేనని అధికారికంగా ప్రకటిస్తూనే ఉంది. ఇప్పుడు అదే విషయాన్ని ఆటగాళ్లు మైదానంలోకి తీసుకురావడంతో వివాదం ముదిరింది. సాధారణంగా ఫిఫా నిబంధనల ప్రకారం.. క్రీడా మైదానాల్లో ఎలాంటి రాజకీయ, ప్రాంతీయ లేదా వివక్షాపూరితమైన నినాదాలు చేయకూడదు. అలాంటి వాక్యాలు ఉన్న దుస్తులు, బ్యానర్లు, జెండాలను ప్రదర్శించడం పూర్తిగా ఫిఫా కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుంది. ఈ ఉల్లంఘనపై అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదిక ప్రకారం.. ఫిఫా ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం అర్జెంటీనా జట్టుపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అర్జెంటీనా జట్టు ఇలాంటి వివాదాల్లో ఇరుక్కోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో 2014లో జరిగిన ఒక ఫ్రెండ్లీ మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా అర్జెంటీనా ఆటగాళ్లు సరిగ్గా ఇలాంటి ఫాక్‌లాండ్ బ్యానర్‌నే ప్రదర్శించి రచ్చ చేశారు. అప్పట్లో ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఫిఫా, క్రీడా నియమాలను ఉల్లంఘించినందుకు గాను అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్‌పై 20 వేల పౌండ్ల భారీ జరిమానా విధించింది. ఇప్పుడు మళ్లీ అదే తప్పును పునరావృతం చేయడంతో, ఈసారి కేవలం జరిమానాతో సరిపెట్టకుండా ఆటగాళ్లపై నిషేధం విధిస్తారా లేక అంతకంటే కఠినమైన చర్యలు తీసుకుంటారా అనేది క్రీడా లోకంలో ఆసక్తికరంగా మారింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com